క్లుప్తంగా

కృష్ణా జలాల వాటాలో న్యాయం చేయాలి



ఆదోనిలో దీక్ష చేపట్టిన నాయకులు

ఆదోనిరూరల్ : కృష్ణా జలాల పునఃపంపిణీ నేపథ్యంలో రాయలసీమ కర్నూలు పశ్చిమ ప్రాంత వాటా కోసం ప్రజలను మేలుకొల్పాల్సిన సమయం ఆసన్నమయ్యిందని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆదోనిలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీడీఏ కన్వీనర్ ఆదినారాయణ మాట్లాడుతూ బ్రిజేష్ ట్రిబ్యునల్‌పై కేసులు నడుస్తున్నా తిరిగి అదే కమిటీకి బాధ్యతలు అప్పజెప్పడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ పంపిణీలో ఆర్డీఎస్ కుడికాలువకు, వేదావతికి 8 టీఎంసీలు కేటాయించాలని, పులికనుమ సామర్థ్యం ఐదు టీఎంసీలకు పెంచాలని కోరారు. అలాగే మేలిగనూరు వరద కాలువ నిర్మించాలన్నారు. ఆర్‌సీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు శాంతరాజు, నగేష్, రాయలసీమ కళావేదిక నాయకులు రామ్‌చరణ్, గోవిందన్న, అంజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ

కోసిగి: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు క్రీడల్లో రాణించే దిశగా ప్రభుత్వం ప్రతి పాఠశాలకు స్పోర్ట్స్ కిట్లు అందజేసింది. సోమవారం పాఠశాలలకు చేరిన స్పోర్ట్స్ కిట్లను ప్రధానోపాధ్యాయుడి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఇందులో ప్రాథమిక పాఠశాల నుంచే క్రీడల్లో ఉత్సాహకంగా పాల్గొనేందుకు క్రికెట్ బ్యాట్, బాల్స్, ఫుట్‌బాల్. వాలీబాల్, స్కిపింగ్, షాట్‌పుట్ తదితర క్రీడా సామగ్రిని ఓ బాక్స్‌లో ఉంచి ప్రతి పాఠశాలకు అందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ-2 నాగేశప్ప సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

ఆదోనిటౌన్: ఆదోని పట్టణంలోని కార్వన్‌పేటలో అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, యువనేత మనోజ్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి భూమిపూజ చేశారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆ ప్రాంతంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పర్యటించిన సమయంలో స్థానికులు రోడ్లు వేయాలని విన్నవించారు. ప్రజలకు ఇచ్చిన మాట మేరకు నేడు సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం పనులు చేపట్టేందుకు భూమిపూజ జరుగుతోందని, పనులు ప్రారంభించి త్వరలోనే పూర్తిచేస్తామని యువ నాయకుడు మనోజ్‌కుమార్ రెడ్డి చెప్పారు. వార్డు ఇన్‌చార్జ్ రామలింగేశ్వరయాదవ్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ వరకు సాగునీరు ఇవ్వాలి



రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: డిసెంబర్ ఆఖరు వరకు ఎల్‌ఎల్‌సీ నుంచి సాగునీరు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు పరమేష్ డిమాండ్ చేశారు. రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెద్దకడబూరును కరువు మండలంగా ప్రకటించాలన్నారు. దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. ఆర్డీఎస్ కుడి కాలువ పనులను చేపట్టి సాగునీరు అందించాలని, రబీ సీజన్‌కు పూర్తి సబ్సిడీతో శనగ విత్తనాలు ఇవ్వాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వీరేంద్రగౌడ్‌కు సమర్పించారు. సీపీఎం, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కోసిగి: మండల పరిధిలోని తుంబిగనూరు గ్రామానికి చెందిన కోర్ల లక్ష్మీ (74) అనే వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక మృతి చెందింది. ఆదివారం తీవ్ర జ్వరం రావడంతో ఆదోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందింది. ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్ రెడ్డి విషయాన్ని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. నగదును గ్రామ సర్పంచ్ వారం ఈరన్న బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

పేదల ఆరోగ్యానికి శ్రీరామ రక్ష

మంత్రాలయం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని 52-బసాపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారు. స్థానిక గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడరాదని సీఎం జగన్‌మోహన్ రెడ్డి వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. జగనన్న సురక్షతో పల్లెల్లో ఎంతో మంది రోగులకు మేలు జరుగుతోందన్నారు. ఉన్న ఊరిలోనే వైద్యులు చికిత్సలు చేయడం, మందులు సరఫరా చేస్తుండడంతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో 410 మందికి పైగా ప్రజలు వైద్య చికిత్సలు పొందారు. అనంతరం మాతాశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని గర్భిణులకు సీమంతం చేశారు. వారిని ఎమ్మెల్యే అక్షింతలతో ఆశీర్వదించారు. సర్పంచ్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ మణిమంజరి, వైద్యాధికారులు గోవిందమ్మ,సురేష్, వైద్యనిపుణులు గీత, శివప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మికాంతరెడ్డి, దశరథరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



బసాపురం గ్రామంలో ఆరోగ్య సురక్ష కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ఆదోనిరూరల్: మండలంలోని మదిరె గ్రామంలోని సచివాలయం-2 పరిధిలో సోమవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా జెడ్పీటీసీ అరుణమ్మ, ఎంపీడీఓ గీతావాణి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఇమ్రాన్‌అహ్మద్, జి.రవిచంద్ర, శాంతి, పవన్, షేక్ తస్లీమాభాను పాల్గొని రోగులను పరీక్షించారు. మొత్తం 406 మంది ఓపీ రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే ఎంపీడీఓ, జెడ్పీటీసీ కంటి సమస్యలు ఉన్న వారికి కళ్లద్దాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీటీ రజనీకాంత్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఆనంద్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ నాగరాజు, గ్రామ సర్పంచ్ నారాయణ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు భేష్

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్న సేవలు భేష్ అని బాపురం సర్పంచ్ శిల్పా, ఎంపీడీఓ సుబ్బారాజు, గ్రామ ఇన్‌చార్జ్ గురునాథ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బాపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా చెయ్యి పట్టుకుని నడిపించే కార్యక్రమాన్ని సురక్ష కార్యక్రమం ద్వారా చేపడుతున్నామని తెలిపారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఆయా కుటుంబాల వారికి ఏదైనా అనారోగ్యం వస్తే రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్యం విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని, అన్ని స్థాయిల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టారని తెలిపారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది న్యూట్రిషన్ స్టాల్‌ను ఏర్పాటు చేసి పౌష్టికాహారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యులు ఇమ్మానుయల్, శిరీష ఆరోగ్య సురక్ష కార్డులను పంపిణీ చేశారు. కార్యదర్శి అబ్దుల్ వాహిద్, నాయకులు దేవిరెడ్డి, అయ్యప్పరెడ్డి, దశరథరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.



మదిరె గ్రామంలో ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ గీతావాణి, వైద్యులు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీటీ రజనీకాంత్‌రెడ్డి



బాపురంలో రోగులకు టోకెన్లు ఇస్తున్న వైద్య సిబ్బంది



బాపురంలో ఆయుష్మాన్ కార్డుల్ని పంపిణీ చేస్తున్న సర్పంచ్, వైద్యులు

ఈరన్న స్వామి దర్శనానికి పోటెత్తిన జనం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రా మంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సో మవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రంలో భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకునేందుకు దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలను చేపట్టారు. పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు.

ఆందోళనకు గురికావొద్దు

ఆదోని సెంట్రల్: విద్యార్థులు, పెద్దలు మానసిక ఆందోళనకు గురికావొద్దని డాక్టర్.చైతన్య కుమార్ సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఒత్తిడి, ఆందోళన వంటి లక్షణాలు ఎలా ఉంటాయి, వాటి నుండి ఎలా భయట పడాలనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. డాక్టర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ముఖ్యంగా సెల్‌ఫోన్లు వంటి వాటికి అడిక్ట్ కాకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. బంధువులు, ఆత్మీయుల మధ్య సమస్యను పంచుకుంటే పరిష్కార మార్గం దొరుకుతుందని పేర్కొన్నారు. పొగాకు ఉత్పత్తులు వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. సోషల్ వర్కర్ సోమశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి వైద్య శిబిరాల షెడ్యూల్

మండలం	గ్రామం	ప్రదేశం	డాక్టర్
ఆదోని పట్టణం	హనుమాన్‌నగర్	అర్బన్ హెల్త్ సెంటర్	యు.అనిల్ సాగర్
ఆదోని	మాంత్రికి	గ్రామ సచివాలయం	ఎస్.శాంతిజ్యోతి
కోసిగి	సజ్జలగూడెం	ప్రాథమిక పాఠశాల	వి.మనోజ్‌కుమార్
కౌతాళం	కంబలూరు	గ్రామ సచివాలయం	ఎస్.ప్రవీణ్‌కుమార్
మంత్రాలయం	చిలకలడొన	చిలకడొన గ్రామం	ఎం.భావన

ఆదోని సెంట్రల్: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా అనేక ప్రాంతాల్లో వైద్యాధికారులు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులు, ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వైద్యం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఒక్కరికీ వైద్యం అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేలా ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో మంగళవారం నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు.



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న ఏఎన్‌ఎం

జనరల్ బోగీలను పెంచాలి

ఆదోని సెంట్రల్: ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను పెంచాలని ఏఐవైఎఫ్, ఏఐటీయూసీ నాయకులు గిరిమల్లప్ప, అజిత్‌గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం స్టేషన్‌మేనేజర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కరోనాకు ముందు ఆదోని నుంచి పలు ప్రాంతాలకు ప్యాసింజర్ రైళ్లు నడిపేవారని, ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే నడుపుతున్నారన్నారు. పేద, మధ్య తరగతి వారు ప్రయాణించేందుకు జనరల్ బోగీలు ఒకట్రెండు మాత్రమే ఉంటున్నాయని, దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రయాణికుల భద్రతతో పాటు సామాన్య ప్రజలు ప్రయాణించే విధంగా రైళ్లను నడపాలని, జనరల్ బోగీల సంఖ్య పెంచాలని కోరారు. నాయకులు ఎస్.సుదర్శన్, కల్లుబావి రాజు, భీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలని ఏఐవైఎఫ్ తాలుకా ప్రధాన కార్యదర్శి రాజు, యువజన సంఘం సభ్యులు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం కోసిగి రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కరోనా కాలంలో రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లను పునఃప్రారంభించాలని కోరారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

కౌతాళం: కర్ణాటక రాష్ట్రంలోని మురవణి నుంచి బంటకుంట గ్రామానికి చెందిన ఈడిగ నరసింహా, కోసిగి మండలంలోని వందగల్లు గ్రామానికి చెందిన హనుమంతు, మునిస్వామి సోమవారం కర్ణాటక మద్యం అక్రమంగా రవాణా చేస్తుండగా కౌతాళం శివారులోని వంక వద్ద సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. వారి నుంచి 20 బాక్సులు ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ ప్యాకెట్లను (మొత్తం 1920) స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. దీని విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందన్నారు. అలాగే రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా మద్యం, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. దాడుల్లో కానిస్టేబుల్ వీరభాస్కర్, వీరేష్, నరేంద్ర, మద్దిలేటిలు పాల్గొన్నారు.

అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని దొడ్డనగేరి గ్రామం వద్ద ఇద్దరు వ్యక్తులు అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్న పీరయ్య తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. దొడ్డనగేరి గ్రామంలోని కొట్టాలకు చెందిన బోయ బాబు, భీమన్న మోటార్ సైకిల్‌పై మూడు బాక్సుల్లో కర్ణాటక టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు పట్టుకున్నామన్నారు. వారి నుంచి 288 మద్యం టెట్రా ప్యాకెట్లను, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఆదోని సెంట్రల్: జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన వారిని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం నేషనల్ పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షురాలు జీవిత మాట్లాడుతూ.. సేవాభావంతో పని చేసినప్పుడే వృత్తికి న్యాయం చేసిన వారవుతారని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు జంబులింగయ్య, ఆదిమూర్తి, సలా ఉద్దీన్, శకుంతల, సావిత్రి, అలాగే పదోన్నతులు పొందిన వారిని ఘనంగా సన్మానించారు. యూటీఎఫ్ నాయకులు పాపయ్య, రుద్రముని,, శ్రీనివాసులు, నారాయణ, నర్సయ్యగౌడ్, అవుల బసప్ప, ఎల్‌కె.బసప్ప, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అక్షరశ్రీ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులను ఉత్తమ టీచర్లుగా ఎంపిక చేసి సన్మానించారు. సోమవారం పాఠశాల డైరెక్టర్ మేఘనాథరెడ్డి ఉత్తమ అవార్డులు పొందిన ప్రిన్సిపాల్ రాఘవేంద్రప్రసాద్, యువరాజ్‌ను ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ.. చేసే పనిని ఇష్టంతో పని చేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని చెప్పారు. తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గడువులోపు అర్జీలను పరిష్కరించాలి

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. అనంతరం మండలంలోని ఆయా శాఖల అధికారులకు సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఏ లోకి వెళ్లకుండా చూడాలన్నారు.

స్పందనలో అర్జీల ద్వారా వచ్చిన సమస్యల్లో కొన్ని

- మంత్రాలయం మండలం వగరూరుకు చెందిన మహ్మద్ కబీర్‌కు సంబంధించి సర్వే నంబర్ 310/ఏలో ఒక ఎకరం భూమి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.
- తమ ఇంటి సమీపంలో విద్యుత్ స్తంభం లేనందున కరెంట్ ఓల్టేజ్ సమస్యలు అధికమవుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని ఆదోని పట్టణం కృష్ణానగర్ కాలనీకి చెందిన నాగవేణి అర్జీ సమర్పించారు.
- నందవరం మండలం నాగలదిన్నెకు చెందిన కురకాల వలిసాబ్‌కు సంబంధించి గౌనెగండ్లలో సర్వే నంబర్ 752/3లో 3.72 ఎకరాలు, సర్వే నంబర్ 599లో 3.42 ఎకరాల భూమి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.
- ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన మల్లికార్జునకు సంబంధించి సర్వేనంబర్ 628/ఏలో 2.73 ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వేరే వారి పేరిట నమోదయ్యిందని, విచారణ చేసి తన పేరిట నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.

కార్యక్రమంలో సీనియర్ సహాయకులు రామయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీయల్‌డీఓ నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ సుధాకర్, డీటీ వలీ బాషా, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.



స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలను వింటున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఆదోనిరూరల్: ఆదోని మండలంలోని గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సోమవారం సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న, కార్యవర్గ సభ్యులు బి.వీరారెడ్డి, డి.రామాంజనేయులు తదితరులు సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను విన్నవించారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో వారు సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని నౌలేకల్ ఎస్‌ఎస్ ట్యాంకు ద్వారా 16 గ్రామాలకు తాగునీరు ఒకే పైపులైన్ ద్వారా సరఫరా చేయడం వల్ల మధ్యలో పైపులైన్ దెబ్బతిని ఆ గ్రామాలకు వారం నుంచి పది రోజుల పాటు నీరు అందే అవకాశం లేదన్నారు. వెంటనే రెండో పైపులైన్ ఆరేకల్ వరకు ఏర్పాటు చేయాలని కోరారు. గణేకల్ గ్రామంలో మృతదేహాలను శ్మశానానికి తీసుకెళ్లేటప్పుడు రైల్వే ట్రాక్ దాటి వెళ్లాల్సి వస్తోందని, శ్మశానానికి రస్తా ఏర్పాటు చేయాలన్నారు. కుప్పగల్లు గ్రామంలో శ్మశానం ఏర్పాటు చేయాలన్నారు. స్పందించిన సబ్‌కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో వృద్ధురాలికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

కౌతాళం: మండల పరిధిలోని బంటకుంట గ్రామంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కర్నూల్ అమీలియా ఆసుపత్రి వైద్యులు నిర్వహించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో శిబిరం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. శిబిరంలో 150 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో 15 మందికి ఆపరేషన్లు అవసరం కాగా వారిని కర్నూలుకు రెఫర్ చేసినట్లు తెలిపారు. మిగతా వారికి మందులను పంపిణీ చేశారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు కూడా పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆశావర్కర్లు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పింఛన్ సౌకర్యం కల్పించాలి



తహసీల్దార్ రుద్రగౌడకు వినతి పత్రం అందజేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

కోసిగి: శ్మశాన వాటికలో మట్టి గుంతలు తీసే, పూడ్చే కార్మికులకు వయసుతో సంబంధం లేకుండా పింఛన్ సౌకర్యం కల్పించాలని డీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు తిక్కయ్య, సీపీఐ మండల కార్యదర్శి గోపాల్ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ రుద్రగౌడను కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి వంశపారపర్యంగా శ్మశాన వాటికల్లో మృతదేహాలను పూడ్చేందుకు గుంత తవ్వడం ద్వారా వచ్చిన పారితోషికంతోనే జీవనం సాగిస్తున్నారన్నారు. వారికి ఎలాంటి జీవనోపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.అలాంటి కార్మికులను గుర్తించి పింఛన్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని కోరారు.

నేడు హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవం

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ముందుగా ఎమ్మెల్యే సజ్జలగుడ్డం గ్రామంలో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం వందగల్లు గ్రామంలో రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తారు. అలాగే కొల్మాన్‌పేట గ్రామంలో ఎమ్మెల్యే నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌ఛార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



వందగల్లులో ప్రారంభోత్సవానికి ముస్తాబైన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం

మెనూ ప్రకారం భోజనం అందించండి

కౌతాళం: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపీడీఓ సుబ్బరాజు ఆదేశించారు. ఆయన సోమవారం మండల పరిధిలోని బాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి వంట సిబ్బందికి పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు వెజిటబుల్ రైస్, ఆలు కుర్మా, బాయిల్డ్ ఎగ్, చిక్కీలను అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ శిల్ప, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్‌వాహిద్, గురునాథ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



బాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కోసిగిలో శౌర్య జాగరణ యాత్ర

కోసిగి: మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో శౌర్య జాగరణ యాత్ర నిర్వహించారు. సోమవారం వీహెచ్‌పీ అధ్యక్షుడు ముకుంద కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం నుంచి తేరుబజారు వరకు యాత్ర చేపట్టారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నంది రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బసవన్న గౌడ, బజరంగ్ దళ్ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వీహెచ్‌పీ స్థాపించి 59 సంవత్సరాలు పూర్తి చేసుకుని 60వ సంవత్సరంలోకి అడుగు పెట్టిందన్నారు. ఈ యాత్ర దేశ వ్యాప్తంగా సాగుతోందన్నారు. హిందువుల్లో దేశభక్తి పెంపొందిస్తూ ముందడుగు వేయాలని సూచించారు. స్థానిక వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి

నాటుసారా స్థావరాలపై నిఘా

ఆలూరు: హొళగుంద మండలం దేవరగట్టులో వెలసిన మాళ మల్లేశ్వర స్వామి దసరా ఉత్సవాలలో భాగంగా నాటుసారా తయారీ, అక్రమ మద్యం తరలింపుపై నిఘా ఉంచినట్లు ఆలూరు సీఐ బి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకునేలా పోలీసు శాఖ ఆధ్వర్యంలో తగిన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నాటుసారా, అక్రమ మద్యం కట్టడికి సెబ్, సివిల్ పోలీసులతో కలిసి ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో 6 చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అల్లర్లకు పాల్పడే వారిపై నిఘా ఉంచామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.